# కొత్త చెప్పులు

సాయంత్రం ఆరున్నర ...!

భార్య తాయారుతో, సంతచెరువు వద్ద సాయిబాబా గుడికి వెళ్ళాడు భానోజీరావు గురువారం. గుడి ఆవరణంతా రద్దీగా ఉంది. గుడిముందు, రోడ్డు మీద భక్తులు తండోప తండాలుగా గుమికూడి ఉన్నారు.

భానోజీరావు భక్తిపరుడు, వారంలో రోజుకో దేవుణ్ని నిష్ఠగా పూజిస్తుంటాడు. బ్యాంకులో క్యాషియరు ఉద్యోగం, అతి జాగ్రత్తపరుడు. పెళ్ళయి అయిదేళ్ళయినా వాళ్ళకింకా పిల్లలు లేరు. పిల్లలు లేరనే బెంగ తాయారులో ఉన్నా, వాళ్ళకింకా కలగక పోవడం. ఒక అదృష్టంగానే భావిస్తుంటాడు భానోజీరావు.

గుడి చుట్టూ జనం, సముద్రంలా పొంగి పొరలుతూ ఉన్నారు...!

ఆ జన సముద్రంలోంచి ఈదుకుంటున్నట్లుగా భార్యాభర్తలిద్దరూ దేవస్థానం చెప్పుల స్టాండు వద్దకు వచ్చారు. అక్కడ చెప్పుల స్టాండు, చెప్పలేనంత రద్దీగా ఉంది. ముగ్గురు కుర్రాళ్ళు మరమనుషుల్లా పని చేస్తున్నారు. జనం చేతుల్లోంచి చెప్పులు తీసుకుని అరల్లో పెడుతూ చీటీలు అందిస్తున్నారు. చీటీలు తీసుకుంటూ చెప్పులు అందిస్తున్నారు.

భానోజీరావు తన చెప్పులతో బాటు, భార్యచెప్పుల్ని చేత్తో పట్టుకున్నాడు.

"ఆగండాగండి...! చీటీల్లేవు... అయిపోయినయి... ఎనక్కెళ్ళండి. మిమ్మల్నే...!" ఉన్నట్టుండి చెప్పుల స్టాండు కుర్రాళ్ళు అరవడం మొదలుపెట్టారు. జనం కింకర్తవ్యం అన్నట్టుగా గోల తగ్గించి నిలబడిపోయారు.

"ఏవండీ! చెప్పుల్ని ఆ ముష్టివాడి ముందు పెట్టండి. పావలా, అర్థో ఇస్తే సరిపోతుంది. ఎందుకా రద్దీలో ఇవ్వడం.?" భార్య తాయారు సలహాతో భానోజీరావు అటుగా చూశాడు. వాళ్ళు నిలబడ్డ చోటుకు ఒకవైపు చాలామంది ముష్టివాళ్ళు వరుసగా కూర్చుని అడుక్కుంటున్నారు. "అయ్యా! అమ్మా!" అంటూ చెప్పుల్ని తమ ముందు ఉంచమని అర్థిస్తున్నారు... భానోజీరావు తమ రెండు జతల చెప్పుల్ని ఒక ముష్టివాడి ముందు ఉంచాడు... వాడు నల్లగా ఉన్నాడు, మెల్లకన్ను. జుట్టు దుబ్బులా పెరిగి ఉంది. బక్కగా ఉన్నాడు... బాసింపటం వేసుకున్నాడు. అప్పటికే వాడి ముందు అయిదారు చెప్పుల జతలు ఉన్నాయి. భానోజీరావు ఇచ్చిన చెప్పుల్ని కూడా తీసుకుని వాటిమధ్య పెట్టుకున్నాడు.

సరే, చెప్పుల సమస్య తీరింది అనుకుంటూ భార్యభర్తలు ఆలయ ప్రాంగణంలో ఉన్న కుళాయి వద్దకు వెళ్ళారు. అక్కడా రద్దీయే. ఎలాగో కాళ్ళు చేతులు కడుక్కుని కుళాయికి ఒక మూలగా ఉన్న పెద్ద బండరాయి మీద కొబ్బరికాయలు కొట్టారు. కొబ్బరి

చెక్కల్ని పట్టుకుని ఇద్దరూ క్యూలో నిలబడ్డారు. రెండు క్యూలు ఒకదాని ప్రక్క ఒకటి కదులుతున్నాయి. భానోజీరావు కళ్ళు సగం మూసుకుని. సగం తెరుస్తూ. సాయి నామస్మరణ చేస్తున్నాడు. భర్త వెనుకే నిలబడ్డ తాయారు భర్తనీ, అతని భక్తినీ... తన్మయత్వాన్నీ నిర్నిమేషంగా చూస్తోంది. భానోజీరావుకు భక్తి ఎక్కువే... ఉభయ సంధ్యల్లోనూ విధిగా పూజలు చేస్తుంటాడు. పెళ్ళయిన కొత్తలో తాయారు భర్త పూజల్ని చూసి దిమ్మెత్తిపోయేది. ఆమెకూ భక్తి ఉన్నా, అతని పూజావిధానం, తీరుతెన్నులూ వింతగానూ, విస్మయంగానూ అనిపించేవి. అవి అలవాటు పడటానికి తాయారుకు కొంతకాలం పట్టింది...

క్యూ ముందుకు నడుస్తోంది. క్యూలో ఒకచోట స్తంభానికి అద్దం, చిన్న చిన్న స్టీలు గిన్నెల్లో విభూతి, కుంకుమ అమర్చి ఉన్నాయి. దంపతులిద్దరూ విభూతీ కుంకుమ ధరించారు. క్యూ మూడు మలుపులు తిరిగింది. ముప్పావు గంట తరువాత "సాయి" దేవుని దర్శనం అయింది.

"భగవాన్ సాయి" అభయహస్తంతో వెండి కిరీటం ధరించి, పట్టుశాలువాతో, ప్రశాంత వదనంతో, అఖండ తేజోరూపంతో వెలిగిపోతున్నారు.

భార్యాభర్తలు కొబ్బరిచెక్కల్ని పూజారి చేతికిచ్చారు. పళ్ళెంలో దక్షిణ వేశారు. ఆచమన తీర్థం, శఠగోపం స్వీకరించారు. గంట గణగణా మ్రోగించి బాబాకు భక్తిపూర్వకంగా నమస్కరించారు. భానోజీరావు బాబా పాదాల ముందు సాగిలపడి సాష్టాంగ ప్రణామం చేశాడు. ఆ తరువాత "ధుని" చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. "ధుని" నిత్యాగ్నిహోత్రం... భగభగ మండుతోంది. ఎవరెవరో భక్తులు చిన్న చిన్న సమిధలు వేస్తూ కటకటాల రేకు గొట్టాల్లోంచి, తొంగి చూస్తున్నారు. దంపతులిద్దరూ క్యూలో నిలబడి, "బాబా" ప్రసాదం, లడ్డూలు కొనుక్కున్నారు. ఆలయ కళ్యాణమండపం మెట్ల మీద కూర్చుని... 'సాయి' సంకీర్తనం వింటూ తృప్తిగా ప్రసాదం ఆరగించారు. సంతృప్తిగా బయటకు వచ్చారు. భానోజీరావు చెప్పుల కోసం ముష్టివాడి ముందుకు దారి తీశాడు. అప్పటికి అక్కడ కొంచెం రద్దీ తగ్గింది. అటూ ఇటూ వరుసగా కూర్చున్న దరిద్ర నారాయణులంతా... 'ధర్మం చెయ్యండయ్యా!' అంటూ సామూహికంగా అరుస్తున్నారు. తాయారు తన చెప్పులు తీసుకుని కాళ్ళకు తొడుక్కుంది. మెల్లకన్ను ముష్టివాడు ముఖం ఇంత చేసుకుని ఆమెవైపు ఆశగా చూస్తున్నాడు.

భానోజీరావు తన చెప్పుల కోసం చూశాడు. అవి అక్కడ లేవు. అతని గుండె గతుక్కుమందో, బెతుక్కుమందో, తాయారు మాత్రం "ఏవండీ మీ చెప్పులు" అంటూ నోరు వెళ్ళబట్టింది. భానోజీరావు ఆత్రంగా ముష్టివాడి చుట్టూ ఉన్న చెప్పుల జతలన్నీ వెదికాడు. అతని జత కనిపించలేదు. కొత్త చెప్పులు.. కొని వారం రోజులు కూడా కాలేదు. మూడువందల ఏభై రూపాయలు. "నా చెప్పులేవీ? ఈవిడ చెప్పులున్నాయి. వీటితో బాటేగా నా చెప్పుల జత కూడా ఉంచాను" అలజడి అణచుకుంటూ ముష్టివాడ్ని అడిగాడు.

"ఏంవో బాబయ్యా! ఏటయినాయో?" వాడు తెల్లమొహం వేశాడు.

'ఏటయినాయో అంటావేంటి, నీ దగ్గరేగా పెట్టాం. కొత్త చెప్పులు, మొన్ననే కొన్నాం!' తాయారు దబాయించి అడిగింది.

'ఏంవో తల్లీ! ఎవరెవరో ఒత్తన్నారు. పావలా అర్ధనా సేతిలో పడేత్తన్నారు. జోల్లు తొడుక్కుని ఎల్లిపోతన్నరు' ముష్టివాడు ముడుచుకుపోతూ అన్నాడు.

"ఎవరివి ఏ జోళ్ళో... ఏ మనుషులు ఏ చెప్పులిచ్చారో, గుర్తు పెట్టుకోలేని వాడివి - చెప్పుల కాపలాకి ఎందుకు ఒప్పుకున్నావురా లమ్డీ కొడకా..?" భానోజీరావు విరుచుకుపడ్డాడు. ముష్టివాడు మాట్లాడలేదు. అప్పటికే అతని జోళ్ళు పోయినట్టు చుట్టుప్రక్కల అందరికీ తెలిసిపోయింది. ఇది మామూలే అన్నట్టుగా అందరూ చూస్తున్నారు. తాయారుకు బాధగానే ఉంది. కొత్తచెప్పులు, భర్త మోజుపడి కొనుక్కున్నవి కనీసం ఒక సంవత్సరం వాడాల్సినవి.

"మాట్లావేంరా.. దొంగవెధవ, తల ఒంచుకుంటే సరిపోతుందా? ఏవీ నీ సంచులు ఒకసారి విప్పి చూపించు" భానోజీరావు కర్కశంగా అన్నాడు. ముష్టివాడి ముఖం పాలిపోయింది. కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. గబగబా వాడి గుడ్డసంచులు మూతలు విప్పి ఒక్కొక్కటీ భానోజీరావు ముందు ఉక్రోషంతో గుమ్మరించాడు.

"సూస్కోండి బావూ! సూస్కోండి!" వాడి ముఖంలో ఏడుపొక్కటే తక్కువయింది. ఆ సంచుల్లోనూ భానోజీరావు చెప్పుల జత లేదు.

"ఎక్కడ దాచావో... ఎలా దాటించేశావో చెప్పరా..? చెప్పకపోయావో,పోలీసుల్ని పిలిచి, నీ చర్మం తోలు ఒలిపించేస్తాను, ఏమనుకున్నావో లం... కొడకా.!"

భానోజీరావులో కోపం, ఆవేశం తిట్ల రూపంలో కదం తొక్కుతున్నాయి. "అలగనకండి బావూ! నాను దొంగని కాను" ముష్టివాడికి ఏడుపు ముంచుకొచ్చింది. "వదిలేయండి! కొత్త చెప్పులకీ పూట కాళ్ళొచ్చాయ్ అనుకుందాం! పదండి వెళ్దాం!" తాయారు భర్తనీ సమాధాన పరచబోయింది. భానోజీరావు ఆమె మాటల్ని ఖాతరు చేయలేదు.

'అయితే ఇప్పుడేమంటావురా? కొత్త చెప్పుల ఖరీదు, రెండువందల ఏభై రూపాయలు నువ్విస్తావా? నీ అబ్బ ఇస్తాడ్రా?' భానోజీరావు రెచ్చిపోయి అరుస్తున్నాడు. "ఏటి సెయ్యమంతారయ్యా? సెప్పండి. నా కన్ను గప్పి ఎవలట్టుకెల్లిపోనారో? నానేటి సెయ్యను?" ముష్టివాడు ముక్కు చీదాడు, ఏడుస్తున్నాడు. అయోమయంగా ఆకాశం వైపు చూస్తున్నాడు. నెత్తిమీద చేతులు పెట్టుకుంటున్నాడు. దేవుడి గుడివైపు చూసి దణ్ణం పెడుతున్నాడు. వాడికి దుఃఖం ఉబికి ఉబికి వస్తోంది.

తాయారుకు వాడినలా చూస్తొంటే జాలి కలిగింది. గుండె కరిగి నీరయింది.

"వీడిదంతా దొంగ ఏడుపు. ఆ చెప్పుల జత ఎక్కడో దాచేసి ఉంటాడు. నువ్వు

నమ్మకు" భానోజీరావు తాయారుతో పట్టుదలగా అన్నాడు.

"పదండి.. వెళ్దాం! చెప్పులేగా, మళ్ళీ కొనుక్కోవచ్చు. అడుక్కునే వాడితో ఇంతసేపు వాదన ఏంటి? అందరూ మనవైపే చూస్తున్నారు నడవండి!" తాయారు సిగ్గుపడుతూ విసుగ్గా భర్త చేతిని పట్టుకుని లాగింది. అతను కదలలేదు. 'ఎవరు చూస్తే నాకేంటి? నువ్వు మాట్లాడకు' భానోజీరావు తాయారువైపు తీక్షణంగా చూస్తు అరిచాడు. తాయారు బిత్తరపోయింది.

"చెప్పు? కొత్త చెప్పుల ఖరీదు నీ బాబు ఎవడిస్తాడ్రా?" ముష్టివాడ్ని నిలదీసి అడుగుతున్నాడు, అరుస్తున్నాడు. వాడు రెండు చేతులు ఎత్తి దణ్ణం పెట్టాడు. తనకేం తెలియదంటూ నెత్తినోరూ బాదుకున్నాడు. అయినా భానోజీరావు ప్రసన్నుడు కాలేదు. నా నష్టానికి ఎవరు జవాబుదారి అన్నట్టుగా అలాగే నిలబడ్డాడు. తాయారుకు భర్త వైఖరి అసహనంగా ఉంది, అసహ్యంగా ఉంది...

"మీకు దణ్ణం పెడతాను పదండీ! వెధవ చెప్పులు పోతే పోయాయిలెండి' తాయారు భర్త చేతిని పట్టుకుని మళ్ళీ బ్రతిమాలింది. అతను విసురుగా తన చేతిని వదిలించుకున్నాడు. ముష్టివాడిని నానా బూతులు తిడుతున్నాడు. ముష్టివాడు ఏడుస్తూ ఏమనుకున్నాడో, వాడిముందు పరచిన గోనె క్రింద నెమ్మదిగా చేయి పెట్టాడు. భానోజీరావు ఆశ్చర్యంగా చూస్తున్నాడు. తాయారు ఆలోచనగా ఉంది. చుట్టుప్రక్కల వాళ్ళు వింతగా చూస్తున్నారు. ముష్టివాడు గోనె క్రింద చేతిని కదిలించి గుప్పెట నిండా చిల్లర నాణాలు తీశాడు. గోనె పట్టామీద పోశాడు. రూపాయి.. అర్ధా... పావలా, పది, ఇరవై.. ఏదో ఉద్రేకంగా, ఉన్మాదంగా ఆ చిల్లర నాణాలవైపు చూపించి ముష్టివాడు భానోజీరావుకు రెండు చేతులెత్తి జోడించాడు.

భానోజీరావు ముఖం ఎర్రగా కందిపోయింది. "అంటే ఏంట్రా? నీ ముష్టి చిల్లర డబ్బులు నన్ను తీసుకోమనా? వెధవన్నర వెధవా" భానోజీరావు తిట్ల దండకంతో రెచ్చిపోతూంటే, తాయారు అతన్ని జబ్బ పట్టుకుని బలవంతంగా బయటకు లాక్కొని వచ్చేసింది.

భార్యాభర్తలిద్దరూ రోడ్డుమీదకు వచ్చారు. భానోజీరావు ముష్టివాడ్ని తిడుతూ, రొప్పుతూ, అడుగులు వేస్తున్నాడు. అతనికి ముష్టివాడు చిల్లర డబ్బులు చూపించి, తీసుకోమనడం అవమానంగా ఉంది. అలాగని 'చెప్పుల ఖరీదు నీ బాబు ఇస్తాడా?' అని అడగటం కూడా తనకు సబబుగానే తోస్తోంది. అడగకపోతే ఎలా? నష్టం?

"వాడు ముష్టివాడు. నిలదీసి అన్నిసార్లు అడిగితే ఏం చేస్తాడు. వాడికీ పౌరుషం వచ్చింది. చిల్లర తీసి మీ ముందు పోశాడు!" తాయారు అనునయిస్తూ అంది.

"వెధవని నాలుగు తన్నులు తన్నేద్దును. ఎందుకులే అని ఊరుకున్నాను" భానోజీరావు కసిగా అన్నాడు. తాయారు భర్తముఖంలోకి చూసింది. అతనిలో మరో రూపం స్పష్టంగా

కనబడుతోంది.

"ఏవండి! వాడితో అంతసేపు దెబ్బలాడటం, వాదించడం మీకు హీనంగా తోచలేదూ?"

"హీనం ఏవిటి? నా నష్టం చెప్పుల ఖరీదు ఎవడిస్తాడు?"

"వాడిచ్చాడా? ఇవ్వగలడా? ఏవండీ! చెప్పులదానం చాలా పుణ్యమంటారు కదా! అలా ఎవరికో దానమిచ్చినట్లుగా సరిపెట్టుకోవచ్చు. ఎందుకు మీరంతగా చికాకు పడిపోతున్నారు? కొత్తవి మనం కొనుక్కోలేమా?"

"కొత్త చెప్పులు నేను కొనుక్కోవచ్చు. నేను కాకపోతే మీ నాన్న కొనిపెడతాడా?"

"అదిగో! ఆ ముష్టివాడ్ని అడిగినట్టే, నన్నూ మీరు అడుగుతున్నారు. మధ్యలో మా నాన్న ఎందుకులేండి? నేనే కొని పెడతాను. సరేనా? మీక్కావల్సింది చెప్పులేగా.. శాంతించండి" తాయారు పెదాల్ని దాటివస్తోన్న కోపాన్ని అణచిపెట్టుకుంది. భర్త ప్రవర్తన ఆమె మనసును మండిస్తోంది. మండుతోన్న మనసుతోనే భర్త వెంట నడుస్తోంది.

"చూడు, చెప్పుల్లేకుండా రోడ్డు మీద ఎలా నడవాల్సి వచ్చిందో?" భానోజీరావు తన కాళ్ళు చూపిస్తూ అన్నాడు.

"రోజులో ఎంతో కొంత సమయం చెప్పుల్లేకుండా నడవడం మంచిదేనట. మనిషికీ, మట్టికీ మధ్య ఉన్న సంబంధం మరింత గట్టిపడుతుందట."

"ఆహా! అలాగయితే... నువ్వూ నీ చెప్పులు ఎక్కడో వదిలేయ్. ఇద్దరం కలిసి నడుద్దాం"

"నా చెప్పుల్ని వదలను, మీతో బాటూ నేనూ చెప్పుల్లేకుండా ఇంటివరకూ నడుస్తాను పదండి!" తాయారు చెప్పుల్ని నేలమీద వదిలి, చేత్తో పట్టుకుని అడుగులు వేస్తోంది.

"ఏవండీ! మిమ్మల్నో మాట అడగనా?"

భానోజీరావు బదులు చెప్పలేదు.

"మీరు బాబా భక్తులే కదా?"

"నీకా సందేహం ఎందుకు వచ్చింది?"

"ఎందుకంటే... 'బాబా' భక్తునికి ఉండాల్సిన శ్రద్ధ, ఓర్పు, దయ మీలో ఏ కోశానన్నా ఉన్నాయాని" తాయారు సూటిగా ప్రశ్నించింది.

భానోజీరావు మౌనంగా అడుగులు వేస్తున్నాడు.

"మీవి కొత్తచెప్పులే. ఒప్పుకుంటాను. నాకేం తెలియదు మొర్రో అంటూ... ముష్టివాడు కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. మీరు వదిలి పెట్టలేదు. వాడ్ని ఏడిపించారు. నానా తిట్లు తిట్టి

కొట్టినంత పనిచేశారు. అది హింసే కదా? సాటిమనిషినీ అదీ ముష్టివాడిని, మీ చెప్పులు పోయినందుకు అలా హింస పెట్టడం 'బాబా' హర్షిస్తాడంటారా? అసలు మనం 'బాబా'ను దర్శించుకున్న ఫలితం ఈ రోజు సహస్రాంశం అయినా మనకు దక్కుతుంటారా?"

తాయారులో ఆవేశం, ఆవేదన. భానోజీరావు మాట్లాడలేదు. అతని కళ్ళల్లో ముష్టివాడు మెదిలాడు. 'నాకేం తెలియదు బాబో' అన్న దీనమైన వాడిరూపం మనో యవనికమీద కనపించింది.

భానోజీరావులో చిన్న చలనం... ఒక కదలిక... ఒక ఆలోచన...!

"సార్! సార్! ఆగండి" ఎవరో పిలిచినట్లయి భార్యాభర్తలిరువురూ వెనక్కి తిరిగారు. ఎవరో ఆగంతకుడు. పొట్టిగా, లావుగా ఉన్నాడు. లాల్చీ, పైజామా, నుదుట విభూతి, కుంకుమ, పరుగెత్తుకుని వస్తున్నాడు.

"సార్! ఇవి మీ చెప్పులేనా?" ఆ వ్యక్తి ఆయాసపడుతూ దగ్గరగా వచ్చి అడిగాడు. అవి భానోజీరావు చెప్పులే అతని కళ్ళు వెలిగాయి. ముఖం ఆనందంతో విప్పారింది.

"సార్! పొరపాటున, నా చెప్పులనుకుని మీవి తొడుక్కుని వెళ్ళిపోయాను. సారీ! ఇంటికి వెళ్ళిన తరువాత గానీ తెలియలేదు. వెంటనే గుడికి తిరిగివచ్చాను. ఆ మెల్లకన్ను ముష్టివాడు చెప్పాడు. చెప్పులు పోయినందుకు వాడ్ని తిట్టి, కొట్టినంత పనిచేశారనీ, ఇప్పుడే వెళ్ళారనీ చెప్పాడు. మీ గుర్తులు అడిగి మరీ ఈ దారిలో పరుగెత్తుకుని వచ్చాను. ఇవిగో సార్! మీ చెప్పులు, ఏమనుకోకండేం? వస్తాను సార్!" ఆ వ్యక్తి సాయిస్మరణ చేసుకుంటూ.. చేతులు జోడించి వెళ్ళిపోతున్నాడు.

భానోజీరావు సంతోషంతో తన 'కొత్త చెప్పులు' తొడుక్కున్నాడు.

"మీరెవరో... మీ పేరేమిటో... నా చెప్పుల్ని నాకు అప్పగించారు. చాలా థ్యాంక్స్! మీ కాళ్ళకు చెప్పులు లేవు. ఏవి? ఏమయ్యాయి?" భానోజీరావు అడిగాడు.

"నావీ కొత్త చెప్పులే సార్! వాడి దగ్గరే పెట్టాను. ఎవరో తొడుక్కుని వెళ్ళిపోయారు" ఆ వ్యక్తి ఉత్తి పాదాలతో వేగంగా అడుగులు వేస్తూ వెళ్ళిపోయాడు.

❀ ❀ ❀ ❀ ❀ ❀

(ఆంధ్రప్రదేశ్ మంత్లీ, అక్టోబరు - 2003)